రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న కలెక్టర్

**వికారాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్సర్వర్ షేక్ ఆష్మిన్ బాషాలు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. హెల్ప్ లైన్ సెంటర్‌ను పరిశీలించారు. జనరల్ అబ్సర్వర్ మాట్లాడుతూ, టివి లో వివిధ ఛానల్స్ తో పాటు లోకల్ ఛానల్స్‌ను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఖర్చుల పరిశీలకులు మనోహర రాజు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీపీఆర్ఓ చెన్నమ్మ, ఉద్యానవన శాఖ అధికారి సత్తర్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ బాబు మోసెస్ తదితరులు పాల్గొన్నారు.


రాంమోహన్‌ను సన్మానించి వీడ్కోలు పలుకుతున్న జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం అధ్యక్షులు వినోద్‌కుమార్, జిల్లా స్థాయి అధికారులు

## కలెక్టరేట్ ఏవో రామ్మోహన్ బదిలీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 27, ప్రభాతవార్త :** మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ఏఓ రాంమోహన్ కీసర రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంకు డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు.

మిగతా 2లో

# పట్టు చిక్కాల మెట్టెక్కాల

## జడ్‌పి, అసెంబ్లీ ఎన్నికల లక్ష్యంగా పంచాయతీ వార్



- ఎక్కువ స్థానాల్లో ఆధిపత్యం కోసం వ్యూహరచన
- గ్రామాల్లో బలమైన అనుచరవర్గం కోసం పావులు
- స్పెషల్ ఫోకస్ పెట్టిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- విజయమే లక్ష్యంగా గెలుపు గుర్రాల ఎంపిక
- నియోజకవర్గ నేతలకు బాధ్యతలు అప్పగింత
- సొంతవర్గాన్ని బరిలోకి దింపనున్న మాజీ మంత్రి చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి
- కొడంగల్ సెగ్మెంట్‌లోనూ ఇదే తంతు
- ఎమ్మెల్యేల సిఫార్సులకు వ్యతిరేకంగా సొంత నిర్ణయాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** అసెంబ్లీ నియోజకవర్గంలో పట్టు సాధించలన్న లక్ష్యంగా అధినేతలు పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. తమ వర్గానికే ఎక్కువ పంచాయతీలు దక్కాలన్న పట్టుదలతో పావులు కదుపుతున్నారు. ఈ ఎన్నికలను రిహార్సల్స్‌గా కాకుండా క్వార్టర్ ఫైనల్స్‌గా తీసుకున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే వర్గాల పోరు చాపకింద నీరులా సాగుతోంది.

జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే, నియోజకవర్గాలలో గట్టి పట్టుఉన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి సర్పంచ్‌ల బలం కీలకంగా మారనుంది. సర్పంచ్ ఎన్నికల తర్వాత రాజకీయ పార్టీల గుర్తులతో జరిగే మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్ని కలను సెమీ ఫైనల్‌గా ప్రధాన పార్టీలన్నీ తీసుకో నున్నాయి. స్థానిక సంస్థలలో ఎక్కువమంది ప్రజాప్రతినిధులు గెలుపొం దితే ఎమ్మెల్యే ఎన్నికల్లో సానుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. కొంతమంది పార్టీ ఫిరాయింపుదారులు కూడా ఉండవచ్చు. వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యక్షంగా ఎన్నికల్లో పాల్గొనక పోయినా ఆయన కనుసన్నలలో ఎన్నికలపై ఫోకస్ పెట్టారని తెలిసింది. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, గెలుపు తదితర అంశాలపై నియోజకవర్గ ముఖ్యనేతలకు తగిన సూచనలు ఇచ్చారని పార్టీవర్గాల సమాచారం.

**కమల దళానికి 'కొండంత' అండ**

బీఆర్ఎస్ తరపున మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, బీజేపీ తరపున ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులతో చర్చించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ జహీరాబాద్ ఇన్చార్జ్‌గా కొనసాగుతున్నా వికారాబాద్ నియోజకవర్గంపై కూడా సమాచారం సేకరిస్తున్నట్లు తెలియవచ్చింది. ఇక్కడ రాజకీయాలలో జోక్యం చేసుకున్నా వరసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి రెండుసార్లు మంత్రి పదవి చేపట్టినందున క్షేత్రస్థాయిలో అన్ని పార్టీల సీనియర్ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో గ్రామస్థాయిలో ఆయనకు పరిచయం ఉన్న నేతలు పోటీ చేయటానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

**తాండూరులో తలోదారి?**

తాండూరులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్ని మండలాల నేతలకు తగిన సూచనలు ఇచ్చారు. బలమైన అభ్యర్థులను బరిలో దించుతున్నారు. అయితే, పలుచోట్ల ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు కొత్త వారిని బరిలో దించుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ప్రభుత్వ విప్ డాక్టర్ పీ.మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కూడా తమ అభ్యర్థులను బరిలో దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో వారికి బలమైన వర్గీయులు ఉన్నందున పంచాయతీ ఎన్నికలపై తరచూ ఆరా తీసినట్లు రాజకీయవర్గాల సమాచారం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయుల్లో ఎక్కువ మంది సర్పంచ్‌లు ఎవరి తరపున గెలుపొందారనే అంశం చర్చనీయాంశంగా మారనుంది.

**సొంత బలంపైనే గురునాథ్‌రెడ్డి గురి**

సిఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లోనూ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అభిమానులు కూడా సొంత బలంతో బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. సిఎం సోదరుడు తిరుపతిరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా సొంత పార్టీలో కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో అభ్యర్థులు సొంత నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కసరత్తులు జరుగుతున్నట్లు తెలిసింది. ఇక బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కూడా కోస్గి, మద్దూరు, బొంరాస్‌పేట, దుద్యాల, కొడంగల్, దౌల్తాబాద్ ముఖ్యనేతలతో మాట్లాడి ఎక్కువ మంది అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. అయితే, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సొంత మండలమైన ఉమ్మడి కులకచర్లలో ఆయన వర్గీయులు బరిలో దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గండీడ్, దోమ, పరిగి, చౌడాపూర్, దోమ, పూడూరు మండలాలలో సర్పంచ్ పదవిపై చాలామంది యువకులు దృష్టి సారించారు. బిఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నారు. ఎక్కువమంది సర్పంచ్‌లు గెలిపించాలని ఆయన పట్టుతో ఉన్నారు. ఈ పార్టీలో ఎలాంటి చీలికలు లేనందున మహేష్‌కు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

**నాడు చిటపిటలు నేటు చెట్టాపట్టాలు**

బీఆర్ఎస్ తరపున బలమైన అభ్యర్థులను బరిలో దించాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కసరత్తులు చేస్తున్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తండ్రి విఠల్‌రెడ్డి తాజాగా జరిగిన బీఆర్ఎస్ నేత గృహ ప్రవేశంలో కలివిడిగా మాట్లాడుకోవడం చర్చనీయంగా మారింది. 2017 నుంచి 2023 వరకు ఎడమొహం, పెడ మొహంగా ఉన్న ఈ నేతలో అకస్మాత్తుగా నవ్వుతూ కనిపించడం చూస్తుంటే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమని అనుకుంటున్నారు. రాజకీయ పార్టీలలో పని చేస్తున్న కిందిస్థాయి కార్యకర్తల మధ్య వైరుధ్యం కొనసాగుతుంటే అగ్రనేతలు మాత్రం ఏ పార్టీలో ఉన్నా తామంతా ఒక్కటే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇది కార్యకర్తలకు మింగుడుపడని అంశంగా భావిస్తున్నారు. అంతేకాకుండా మొన్నటి వరకు అవతల పార్టీకి పనిచేసిన రెండోశ్రేణి నాయకులను చేరదీసి ప్రాధాన్యత ఇవ్వడాన్ని కూడా గ్రామస్థాయిలో జీర్ణించుకోవడం లేదని తెలుస్తోంది.


మంబాపూర్‌లో నామినేషన్ దాఖలు చేసిన సాయిని మహదేవి

## సంగ్రామం షురూ..

### తొలిరోజే నామినేషన్ల ఊపు

### వికారాబాద్‌లో సర్పంచ్ పదవులకు 162 - వార్డు సభ్యులకు 87

**వికారాబాద్, నవంబరు 27, ప్రభాతవార్త :** తొలిరోజు నుంచే గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఇందులో భాగంగా గురువారం మొదటి విడత పోలింగ్‌కు గాను నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని తాండూరు, బషీరాబాద్, యాలాల్, పెద్దెముల్, కోడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల్ మండలాల గ్రామ పంచాయితీలకు నామినేషన్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థుల నుంచి 162 నామినేషన్‌లు దాఖలు కాగా, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి 87 నామినేషన్లు దాఖలు అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.


నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ పశాంత్ జీవన్

## క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోండి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబరు 27 ప్రభాతవార్త :** నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. గురువారం మొదటి దశ పోలింగ్ కు సంబంధించి గురువారం నుండి ప్రారంభమైన ఈ నేపథ్యంలో శంషాబాద్ మండలం పెద్దతుప్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెద్దతుప్ర, పెద్దతుప్ర తండా, ముచ్చింతల్, మదనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లి, మదనపల్లి కొత్త తాండ, మదనపల్లి పాత తాండ గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వ హించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. జనరల్ అబ్జర్వర్ వెంట శంషాబాద్ ఎంపిడిఓ మున్ని, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## ఏకగ్రీవానికి బేరసారాలు

**పెద్దేముల్, నవంబరు 27, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీల ఎన్నికల నగారా మోగడంతో గ్రామాల్లో గురువారం నుంచి నామినేషన్ల కోలహలం నెలకొంది. పెద్దేముల్ మండలంలో నామీనేషన్లు వేసేందుకు మొత్తము 9 క్లస్టర్లుగా విభజించారు. ఆయా క్లస్టర్లలో సర్పంచ్‌లకు 27 మంది అభ్యర్థులు, వార్డు మెంబర్లకు 25 మంది నామినేషన్ దాఖలు చేసినట్లు యంపిడిఓ రతన్‌సింగ్ తెలిపారు. అయితే ఆయా గ్రామాలలో అభ్యర్థులు సర్పంచ్, వార్డు మెంబర్లుగా ఏకగ్రీవంగా అయ్యేందుకు బేరసారాలు జరుపుతున్నారు. అందుకు గాను దేవాలయాల, గ్రామాల అభివృద్ధి పేరిట డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఏకగ్రీవం అయ్యే అభ్యర్థులు గ్రామస్థులు ఖరారు చేసిన డబ్బులు ఇవ్వవలసి ఉంటుంది. ఇంకా రెండు రోజులు నామినేషన్లు వేయడానికి సమయం ఉండటంతో మరికొందరు వేచిచూస్తున్నారు. వారు అనుకున్నట్లు ఎవరు కూడా ఆయా గ్రామాలలో నామినేషన్ వేయకపోతే ఒప్పందం కుదుర్చుకున్న ప్రకారం డబ్బులను ఇచ్చేందుకు అంగీకారానికి వచ్చినట్లు తెలిసింది. నామినేషన్ దాఖలు వేసేందుకు గురువారం మొదటి రోజు కావడంతో అందులో భాగంగా మంబాపూర్ క్లస్టర్‌లో మంబాపూర్ గ్రామానికి చెందిన సాయిని మహదేవి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్ రెడ్డి, గోపాలక్రిష్ణ దేవాలయ కమిటీ చైర్మెన్ ముదిని రాములు, సీనియర్ నాయకులు గంగసారం క్రిష్ణరెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, గంగసారం శ్రీనివాస్‌రడ్డి, డి,సుధాకర్‌రావు, మైపూస్, తెరువతి నర్సిములు, తిమ్మగల్ల బాలప్ప, నాగేందర్, లక్ష్మిదేవి, వెంకటమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఖాతా కోసం పరుగు



**కొందుర్గు, నవంబరు 27, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యులకు పదవి కోసం నామినేషన్ వే వేయటానికి వెళ్లిన అభ్యర్థులకు తప్పని సరిగా బ్యాంకు ఖాతా ఉండాలని ఎన్నికల సిబ్బంది ఎన్నికల సిబ్బంది చెప్పడం తో అభ్యర్థులు బ్యాంకు పోస్ట్ ఆఫీస్ వద్దకు పరుగులు తీస్తున్నారు. నామి నేషన్ల మొదటి రోజు గురువారం నాడు పలువురు అభ్యర్థులు నామినేషన్ పత్రా లు తీసుకొని నామినేషన్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడ సిబ్బంది నామినేషన్ తోపా టు కొత్తగా బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ లో ఖాతా తెరవాలని చెప్పడంతో గత్యం తరం లేని పరిస్థితిలో అభ్యర్థులు బ్యాంకులకు, పోస్ట్ ఆఫీస్ లకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా షాద్నగర్,చేవెళ్ల పట్టణాలకు వెళ్లి వివిధ బ్యాంకుల్లో ఖాతాలను తెరుస్తున్నారు.


**నిబంధనలు తొలగించండి!**

ఎన్నికల పోటీ చేసే వాళ్ళు తప్పనిసరిగా తాజాగా బ్యాంకు ఖాతా తెరవాలని నిబంధన విధించడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పలురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు బ్యాంక్ ఖాతా కావాలంటే ఉన్న రెండు రోజుల్లో మారుమూల గ్రామాల అభ్యర్థులకు వీళ్ళు కాదని, గతంలో లేని నిబంధన ఇప్పుడు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నామినేషన్ వేయడానికి బ్యాంక్ ఖాతా నిబంధనను తొలగించాలని పలు గ్రామాల అభ్యర్థులు కోరుతున్నారు.

## బిసిల కస్సుబుస్సు

### 2011 జనాభా లెక్కల ప్రకారమే పంచాయతీ సమరం
### 2019 ఎన్నికలలో బిసిలకు 26 శాతం వరకు రిజర్వేషన్లు
### ప్రస్తుతం 17 శాతం మాత్రమే కేటాయిపు పట్ల నిరసన
### సత్తా నిరూపించాలని బిసి సంఘాల నిర్ణయం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** బిసిలకు పంచాయతీ ఎన్నికల్లో మరోసారి మొండి చేయి చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 శాతం బిసిలకు గ్రామపంచాయతీ రిజర్వేషన్లు ఇవ్వగా వికారాబాద్ జిల్లాలో 18 శాతం మాత్రమే కేటాయించడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. జిల్లాలో 594 గ్రామపంచాయతీలు ఉండగా 107 జీపీలను బిసిలకు రిజర్వు చేశారు. అంటే 18.013 శాతం బిసిలకు రిజర్వేషన్లు కల్పించినట్లు లెక్క.



దీనిపై సర్వత్రా వ్యతిరేక స్వరం వినిపిస్తోంది. బిసి జనాభా 56.33 శాతం ఉండగా రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించింది. అయితే, కోర్టు మొట్టికాయలు పెట్టడంతో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు 50 శాతం లోపే రిజర్వేషన్లను కల్పిస్తూ పంచాయతీ ఎన్నికలకు వెళ్లింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 2018-19లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. అదే గణాంకాల ప్రకారం ప్రస్తుత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అప్పట్లో బిసిలకు 23 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించారు. మరి పాత జనాభా లెక్కల ప్రకారమే ఇప్పుడూ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. మరి అప్పటికంటే ఈసారి మరీ తక్కువగా రిజర్వేషన్లు కల్పించడం పట్ల బిసి సంఘాలు తీవ్రస్థాయిలో మండి పడుతున్నాయి. ఇటీవల బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ప్రకటించినా ఇక్కడ జరుగుతున్న అన్యాయంపై బిసి సంఘాలు భగ్గుమంటున్నాయి. సిఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీకి వెళ్లినా బిసి రిజర్వేషన్లపై ప్రధాని మోడీ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని బిసి కమిషన్ మాజీ సభ్యుడు నూలి శుభప్రద్‌పటేల్ ప్రశ్నించారు. వారిరువురికీ బిసిలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జనాభాలో అధికశాతం ఉన్న బిసి రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ హయాంలో బిసిలకు 24 శాతం నుంచి 26 శాతం వరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు దక్కాయని గుర్తు చేశారు. ఇలా ఉండగా బిసిలకు జరిగిన అన్యాయంపై పోరాటం చేస్తామని వికారాబాద్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అన్నారు.

## డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓగా లావణ్యరెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 27, ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓగా డాక్టర్ సిహెచ్ లావణ్యరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మల్కాజ్‌గిరి డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓగా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

జిల్లాలోని మేడ్చల్ మండలం శ్రీరంగవరంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓగా ఆమె నియమితులయ్యారు. ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించటంతో పలువురు వైద్యులు, సిబ్బంది స్వాగతించి అభినందనలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి ఆదేశాలను అనుసరిస్తూ మల్కాజ్‌గిరి డివిజన్‌లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా విధులు నిర్వహించటం జరుగుతుందని డాక్టర్ లావణ్య పేర్కొన్నారు.


ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకులు,జిల్లా కలెక్టర్

## ఖర్చులపై కన్నేయండి

### అభ్యర్థులు లెక్క చెప్పకపోతే ఎన్నిక రద్దు
### ఎన్నికల పరిశీలకులు హాస్మిన్ ఆదేశం

**కొడంగల్, నవంబరు 27 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని వికారాబాద్ జిల్లా సాధారణ పరిశీలకులు షేక్ హాస్మిన్ భాష అధికారులకు సూచించారు. గురువారం బొంరాస్‌పేట్ మండలంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు షేహాస్మిన్ బాష, వ్యయ పరిశీలకులు మనోహర్‌రాజులు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధతో కలిసి నామినేషన్‌లకు సంభందించిన కేంద్రాలను పరిశీలించారు. బొంరాస్‌పేట్ రూఇతువేదికలో బొంరాస్‌పేట్, దుప్చర్ల, మహంతిపూర్, జానకంపల్లి గ్రామపంచాయతీలకు అదేవిధంగా తుంకిమెట్ల రైతువేదికలో తుంకిమెట్ల, బొట్లవానితండా, నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీతలకు సంభందించిన నామినేషన్‌ల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సాధారణ పరిశీలకులు షేక్ హాస్మిన్ బాష మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్‌ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్‌లు దాఖలు చేసే క్రమంలో కావాల్సిన ధృవపత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థు లకు తెలియజేయాలని అమె సూచించారు. నామినేషన్‌ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో తప్పులు ఉంటే సరిచేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. వ్యయ పరిశీలకులు మనోహర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అన్నారు. అభ్యర్థుల వ్యయం వివరాలు సమర్పించని ఎడల గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులకు వ్యయాలకు సంభందించి ప్రత్యేక బ్యాంకు ఖాత ఉండాలని ఆయన సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నామినేషన్‌ల కేంద్రాల పరిశీలనలో తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## నిధుల లేమితో నిర్వహణ భారం

**కుల్కచర్ల, నవంబరు 27, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం క్లస్టర్ పరిధిలో రైతు వేదికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. రెండేళ్లుగా వీటి నిర్వహణకు నిధులు రావడం లేదు. కనీస వసతులు లేకపోవడంతో అసౌకర్యాలకు నిలయాలుగా మారుతున్నాయి. గతంలో రైతు వేదికలు రైతులతో ప్రతి రోజు కళకళలాడుతూ ఉండేవి. వ్యవసాయ శాఖ ఏఈఓలు ప్రతి రోజులు రైతు వేదికలకు వచ్చి అక్కడ రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకునే వారు. కానీ నేడు ఆ కళ లేకుండాపోయి రైతు వేదికల నిర్వహణ అస్థవ్యస్థంగా మారింది. కొన్ని గ్రామాల్లో ఇది రైతు వేదికన లేక పక్షులకు అడ్డాన అన్న మాదిరిగా మారిపోయింది. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదిక వైపు కన్నెతి కూడా చూడకపోవడంతో అడవి పక్షులే జీవనం కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం ఉన్నత లక్ష్యాలతో రైతు వేదికలను నిర్మించారు. రైతులకు సలహాలు, సూచనలు, శిక్షణ తరగతుల, నూతన వంగడాలు, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందుబాటులో ఉన్న ఎరువులు, వినత్తనాలు, అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తానాల గురించి అవగాహన కల్పించడం కోసం రైతు వేదికలను నిర్మించింది. ప్రతి 5 వేల మంది రైతులకు రెండు నుంచి నాలుగు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా






ఏర్పాటు చేసింది. కాని ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నరని ప్రజల నుండి అరోపణలు వినిపిస్తున్నాయి. ముజాహిద్‌పూర్ రైతు వేదికను శుభ్రం చేసేవారు లేక దుమ్ము, ధూళితో, అడవి పక్షులతో దర్శనమిస్తోంది. వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతు వేదికకు పూర్వ వైభవం తేవాలని, రైతులకు ఉపయోగపడే విధంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఓటరు డేటాను 100 శాతం సెర్చింగ్‌తో పూర్తి చేయాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 27, ప్రభాతవార్త :** 2002 మ్యాపింగ్ (ఓటరు) డేటాను 100శాతం సెర్చింగ్‌తో పూర్తి చేయాలని ఈఆర్‌ఓలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిలాన కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఈఆర్‌ఓలు సిఇఓ తెలంగాణ వెబ్‌సైట్‌లోని పిఎస్ వైజ్‌గా (ఓటరు) డేటాను పిడిఎఫ్ ఫార్మెట్‌లో డౌన్‌లోడ్ చేసి దానిని ఎక్సల్ ఫార్మట్‌కు మార్చాలని ఈఆర్‌ఓలను ఆదే శించారు. సిఇఓ తెలం గాణ వెబ్‌సైట్‌లో సెర్చ్ ఆప్షన్ ద్వారా హౌజ్ నెంబరు, పేరు, అండ్ ఎపిక్ నెంబరు ద్వారా సెర్చ్ చేసే ఆప్షన్‌ను ప్రారంభించబడినట్లు ఆయన తెలిపారు. 2002 మ్యాపింగ్ డేటాను వంద శాతం సెర్చింగ్‌తో పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి



అనురాగ్ యూనివర్శిటీలో ఎన్ఐ ల్యాబ్ వ్యూ ఎఫ్‌డిపి కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల డీన్ విజయ్‌కుమార్ తదితరులు

## అనురాగ్ యూనివర్శిటీలో ఎన్ఐ ల్యాబ్ వ్యూ ఎఫ్‌డిపి ప్రోగ్రాం నిర్వహణ

**ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ విశ్వవిద్యాలయం ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే నేషనల్ ఇన్స్టుమెంటు ల్యాబ్ వ్యూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంను గురువారం కళాశాల డీన్ వి. విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ ఇసిఇ విద్యార్థులు భవిష్యత్తులో ల్యాబ్ వ్యూ టూల్ ఎలా ఉపయోగించాలో అవగాహన కల్గుతుందని అన్నారు. టూల్‌ని రక్షణ రంగ సంస్థలు ఎలా వినియోగిస్తున్నాయి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు పరిశ్రమ అయిన మ్యూటెక్నాలజీస్ నుండి ఎండి. ఉమర్ ఫారూఖ్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, ఎం. మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూసేకరణ నోటిఫికేషన్ గడువు పొడిగింపు

**దుద్యాల్, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి, హకీంపేట్, లగచర్ల రెవె న్యూ గ్రామాలలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణ చేయుటకు గత సంవత్సరం 29.11.2024 నాడు నోటిఫికేషన్ జారీ చేశారు. దుద్యాల్ తహసిల్దార్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం, పోలేపల్లి గ్రామంలో భూసేకరణ పూర్తి అయ్యింది. హకీంపేట్ గ్రామం పట్టా భూముల సేకరణ పూర్తయింది. ప్రభుత్వ భూములలో కొంత సేకరించవలసి ఉంది. లగచర్ల గ్రామంలో దాదాపుగా 75 శాతం పట్టా, ప్రభుత్వ భూములు తీసుకోవడం జరిగింది. మిగలిన భూమి భూసేకరణ చేయుటకు గత సంవత్సరం 29.11.2024 రోజు చేసిన ప్రైమరీ నోటిఫికేషన్ ప్రకటన ను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ 22, నవంబర్, 2025 నాడు ఇంకో ఏడాది పాటు పొడిగించినట్లు ఉత్తర్వులు అందాయని తహసిల్దార్ కిషన్ తెలిపారు.

## నేడు అద్రాస్‌పల్లిలో ఉచిత ఆరోగ్య శిబిరం

..సద్వినియోగం చేసుకోవాలి

**శామీర్‌పేట, నవంబరు 27, ప్రభాతవార్త:** అద్రాస్‌పల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఘనపూర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడిసిటీ హాస్పిటల్ ఆర్గనైజర్స్ కోరారు. మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లి గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ వారు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత ఆరోగ్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపి, షుగర్, పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, చెవి, ముక్కు,గొంతు, వరిబీజం, భీజకుట్టు, గడ్డలు కంథలు, థైరాయిడ్, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మొకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు వాటిపై వైద్యులు పరీక్షించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అద్రాస్‌పల్లి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి

: జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా

**పూడూరు, నవంబరు 27, ప్రభాత వార్త:** పోలీసు అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా పేర్కొన్నారు .వికారాబాద్ జిల్లా ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా గురువారం చెన్‌గోముల్ పోలిస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని,వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు.ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించి,వారి పమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.కేసుల విచారణలో నాణ్యత పాటించి,నిందితులకు శిక్షపడే విధంగా చూడాలని ఆదేశించారు. పోక్సో,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు,మహిళలు,బాలికలకు సంబంధించిన కేసులు,ఇతర గ్రేవ్ కేసులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఆస్తి సంబంధిత నేరాలైన దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమతంగా ఉండాలని,ఎన్నికలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించాలని



పూడూరు మండలం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా

తెలిపారు.సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని,విధుల్లో క్రమశిక్షణతో పాటు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలోఎస్.ఐ భరత్‌కుమార్‌రెడ్డి,మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు దైవ చింతనను అలవర్చుకోవాలి



శ్రీ హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి

**కీసర,నవంబరు 27, ప్రభాత వార్త:** ప్రజలు దైవ చింతనను అలవర్చుకోవాలని రాంపల్లిదాయరలోని హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి అన్నారు.గురువారం స్వామివారికి విశేష పూజలు,స్వామివారికి అభిషేకాలు,సుదర్శన హోమం కార్యక్రమాలు నిర్వహించారు.సాయంత్రం 5.30 నిమిషాలకు శ్రీ వైష్ణవ ఆగమ శాస్త్ర ప్రకారంగా ఆలయ జీర్ణోద్దారణ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా " శాంతి కళ్యాణం" నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శాంతి కళ్యాణాన్ని విజయవంతం చేశారు.అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు మెంబర్లు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు అధిక సంక్యలో వచ్చి ప్రత్యేక పూజల్లో,శాంతి కళ్యాణంలో పాల్గొన్నారు.



శ్రీ రేణుక ఎల్లమ్మ,కొండ పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## శ్రీ రేణుక ఎల్లమ్మ,కొండ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కీసర,నవంబరు 27, ప్రభాత వార్త:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామం లోని శ్రీ భ్రమరాంబ మల్లి ఖార్జున స్వామి ఆలయం ప్రాంగణంలో జరిగిన శ్రీ ఎల్లమ్మ,శ్రీ కొండ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గురువారం మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తుంగ ధర్మేందర్,ఆకిటి మహేందర్‌రెడ్డి,మాజీ కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి


పంది వెంకట్రాంరెడ్డి, ఉద్యమకారుల సంక్షేమ సంఘం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

**షాద్‌నగర్, నవంబరు 27, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు తగిన ప్రాతినిత్యం కల్పించాలి అని, ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేసారు. ఉద్యమకారులు లేనిదీ తెలంగాణను ఊహించుకోలేమని చెప్పారు, కాబట్టి ఉద్యమకారులను గుర్తించి సర్పంచు మరియు వార్డ్ మెంబెర్ స్థానాలల్లో అవకాశం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేసారు. ఈ



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

కార్యక్రమం లో పాల్గొన్న మండల అధ్యక్షులు దొడ్డి రవీందర్, పట్టణ అధ్యక్షులు ఏ. శ్రీనివాస్ రెడ్డి, బి.సి. సంఘం అధ్యక్షుడు మేకల వెంకటేష్, రవికుమార్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష యాదవ్

## పేదవాడికి సొంతింటి కలను నేరవేర్చడమే లక్ష్యం

**కీసర,నవంబరు 27, ప్రభాత వార్త:** పేదవాడికి సొంతిటి కళను నేరవర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రే యాదవ్ అన్నారు.గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి 5 లక్షల ఆర్థిక సాయం చేయడానికి సిద్దంగా ఉందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సిఎం రేవంత్‌రెడ్డికి,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కారక్రమంలో మున్సిపల్‌కమీషనర్ వెంకట్‌రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలక్రిష్ణ యాదవ్,మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్,నాయకులు,మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా బాల్యమిత్రులు

**యాచారం,నవంబరు 27, ప్రభాత వార్త:** యాచారం మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామానికి చెందిన గోలి వెంకటేష్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు అందరూ కలిసి గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.56 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సందర్భంగా తమ స్నేహితులలో ఒకరైన వెంకటేష్ చనిపోవడం తమను ఎంతో కలచి వేసిందని అన్నారు. మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాల్య స్నేహితులు, మృతుని కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

## వజ్రేష్ యాదవ్‌ని కలసిన మాజీ కౌన్సిలర్ పడాల అనురాధ యాదగిరిగౌడ్



వజ్రేష్ యాదవ్‌ని శాలువాతో సన్మానించి పూలబొకేను అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ పడాల అనురాధ యాదగిరిగౌడ్

**కీసర,నవంబరు 27, ప్రభాత వార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్‌ని గురువారం దమ్మాయిగూడ 12వ వార్డు కౌన్సిలర్ పడాల అనురాధ యాదగిరిగౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.శాలువాతో సన్మానించి,పూల బొకేను అందజేశారు.

## బిసిల గొంతు కోశారు..!

### పంచాయతీ ఎన్నికలను ఆపేయాలి

షాద్‌నగర్ పట్టణ బిఆర్‌ఎస్ యువనేత నందారం అశోక్ యాదవ్ డిమాండ్

**షాద్‌నగర్ టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త :** బిసి రిజర్వేషన్ల పేరిట సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని బీఆర్‌ఎస్ షాద్‌నగర్ పట్టణ యువ నాయకుడు నందారం అశోక్ యాదవ్ ధ్వజమెత్తారు. 42శాతం రిజర్వేషన్ల అంటూ బిసిలను మోసగించిన సిఎంగా చరిత్రలో రేవంత్‌రెడ్డి నిలిచిపోతారని తీవ్రంగా మండిపడ్డారు. కెసిఆర్ హయాంలో ఇచ్చిన 24శాతం రిజర్వేషన్‌ను 17శాతానికి తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణన పేరిట రూ.160కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. తడిగుడ్డతో బిసిల గొంతు కోసిందని ధ్వజమెత్తారు. పార్టీతో సంబంధం లేని పంచాయతీ ఎన్నికల్లో... పార్టీ పరంగా బిసిలకు ఎలా రిజర్వేషన్లు ఇస్తారని ప్రశ్నించారు..? ఈ మోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందిస్తారా? లేక స్థానిక బిసి నేతలు స్పందించే దమ్ముందా ?అని నిలదీశారు. రిజర్వేషన్లు తగ్గడంపై బిసిల ఆగ్రహం పంచాయతీ ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు తగ్గడంపై రాష్ట్ర వ్యాప్తంగా బిసి నాయకులు, బిసి సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అశోక్ యాదవ్ స్పష్టం చేశారు.జీవో 46ను వెంటనే రద్దు చేయాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించేవరకు పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడతామని అశోక్ హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు బలమైన ఉద్యమం చేస్తామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు కేవలం 17 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేశారని మండిపడ్డారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించేవరకు విశ్రాంతి తీసుకోబోమన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అనేది ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. జీవో 46ను వెంటనే రద్దు చేసి, సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయాలని అశోక్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బిటెక్ విద్యార్థిని అదృశ్యం



దీక్షిత

**ఘట్‌కేసర్, నవంబరు 27, ప్రభాతవార్త :** బిటెక్ విద్యార్థిని ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌కు చెందిన ఎర్రోళ్ల దీక్షిత (21) కొండాపూర్ సంస్కృతి కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్నది. బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం కొద్దిసేపటికి నిద్రపోయింది. గురువారం ఉదయం ఆమె తండ్రి ఆనంద్ లేచి చూసేసరికి కనిపించకుండా పోయింది. దీక్షిత ఇంట్లో ఎవరికి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోవడంతో ఫోన్ చేయగా స్విచ్డ్ ఆఫ్ వస్తుంది. ఆమె కోసం అంతటా వెతికినా ఆచూకి లభించకపోవడంతో తండ్రి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీక్షిత ఎత్తు 4.9 అడుగులు ఉంటుందని, తెలుపు రంగు, పింక్ కలర్ టాప్, తెలుపు రంగా ప్యాంటు ధరించి ఉందని ఆమేరకు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఆమె ఆచూకి తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# నామినేషన్ల కోలాహలం



## జిల్లేడు చౌదరిగుడాలో 30 నామినేషన్‌లు

**జిల్లేడు చౌదరిగూడెం, నవంబరు 27, ప్రభాత వార్త:** జిల్లేడు చౌదరిగుడా మండలంలో గురువారం సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 30 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలాగే ఐదు మంది వార్డు సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## కొడంగల్‌లో 18 నామినేషన్‌లు



పర్సాపూర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

**కొడంగల్, నవంబరు 27, ప్రభాత వార్త:** సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం మొదటిరోజు కొడంగల్ మండలంలోని 25 గ్రామ సర్పంచ్ స్థానాలకు గాను 9 గ్రామాల్లో 18 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్‌లు దాఖలు చేశారు. పర్సాపూర్‌లో నలుగురు,హస్నాబాద్‌లో ముగ్గరు,సంగాయపల్లిలో ఇద్దరు,కస్తూర్‌పల్లిలో ఇద్దరు,ఇందనూర్‌లో ఒకరు,ప్యాలమద్దిలో ఒకరు,ఉడిమేశ్వరంలో ఇద్దరు,పోశమ్మతండాలో ఇద్దరు,నాగారంలో ఒకరు సర్పంచ్ స్థానాలకు నామినేషన్‌లు దాఖలు చేశారు. పర్సాపూర్,హస్నాబాద్,నాగారం గ్రామాల్లో 12 మంది వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్‌లు దాఖలు చేశారు.ఇదిలావుండగా డిప్యూటీ కలెక్టర్(ట్రేని) చంద్రకిరణ్ గురువారం కొడంగల్ ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ కేంద్రాన్ని సందర్శించారు.

## దుద్యాల్‌లో 10 నామినేషన్లు

**దుద్యాల్, నవంబరు 27, ప్రభాత వార్త:** సర్పంచు ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు గురువారం మండల వ్యాప్తంగా 10మంది సర్పంచు అభ్యర్థులు, ఇద్దరు వార్డు మెంబర్ అభ్యర్థులుగా నామినేష న్లు వేశారు. సర్పంచు అభ్యర్థులుగా చెట్టుపల్లితండా ఒకరు, కుదురుమళ్ల గ్రామంలో



కుదురుమల్లలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న లాలప్ప

ఇద్దరు, ఆలేడు గ్రామంలో ఒకరు, హకీం పేటలో ఒకరు, పోలేపల్లి ఒకరు, గౌరారంలో ఇద్దరు, ఈర్లపల్లిలో ఒకరు, సంత్రకుంటతాండాలో ఒకరు సర్పంచు అభ్యర్థులుగా నామి నేషన్లు దాఖలు చేశారు. సాగారంతాండా ఒకరు, సంత్ర కుంటతాండా ఒకరు వార్డు సభ్యులుగా నామినేషన్ల ు వేశారని దుద్యాల ఇంచార్జ్ ఎంపీడీవో జైపాల్ రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ తెలిపారు.

## కొందుర్గులో తొలి రోజు 34 నామినేషన్లు!

**కొందుర్గు, నవంబరు 27, ప్రభాత వార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల కోసం తొలి రోజు 34 నామినేషన్లు వచ్చినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి లక్ష్మీ ్మ అనురాధ తెలిపారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలకు గురువారం మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 15 మంది, వార్డు సభ్యులకు 19 మంది నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు.

29 గ్రామాల్లో 24 సర్పంచ్ అభ్యర్థులు పేర్లు నమోదు





అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి

## కేశంపేటలో సర్పంచ్ నామినేషన్లు వేగం

**కేశంపేట, నవంబరు 27, ప్రభాత వార్త:** కేశంపేట మండలం పరిధిలోని 29 గ్రామపంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో, గురువారం అన్ని గ్రామాలలో కలిపి మొత్తంగా 24 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి

**సర్పంచ్ పదవికి మొదటిరోజు దాఖలైన నామినేషన్లు:**

1. సుందరాపూరం- 1
2. సంగెం - 3
3. బోదునంపల్లి - 2
4. చింతకుంటపల్లి - 1
5. ఏక్లాస్ ఖాన్ పేట్ - 1
6. కేశంపేట్ - 3
7. కోనాయిపల్లి - 1
8. కొండరెడ్డిపల్లి - 2
9. కొత్తపేట్ - 5
10. లేమామిడి - 1
11. మంగళగూడ - 2
12. తూర్పుగడ్డ తండా - 1
13. వేములనర్వ - 1

వార్డు సభ్యుల నామినేషన్లు కూడా కొనసాగుతున్నాయివిభిన్న గ్రామాల్లో వార్డు సభ్యుల పదవులకు నేడు దాఖలైన నామినేషన్లు ఇలా ఉన్నాయి:

1. భోదునంపల్లి - 2
2. చౌలపల్లి - 1
3. కోనాయిపల్లి - 1
4. కొత్తపేట్ - 2
5. పాపిరెడ్డిగూడ - 1


27వ తేదీ నాటికి నామినేషన్ దాఖలు ప్రక్రియ ఊపందుకుంది.

26 మరియు 27 తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ చురుకుగా సాగుతుండగా, గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మరింత రంకెలేసింది. అభ్యర్థులు, కార్యకర్తలు మరియు ప్రజలతో గ్రామాలన్నీ సందడిగా కనిపించాయి

## ఫరూక్ నగర్ మండలంలో నామినేషన్ల స్వీకరణ

సర్పంచ్ పదవి పోటీకి ఆయా గ్రామాల్లో 34 నామినేషన్లు 19 మంది వార్డు సభ్యుల నామినేషన్లు ఫరూక్ నగర్ షాద్‌నగర్ ఎంపీడీవో బన్సిలాల్ వెల్లడిమొదటి విడతకు మొదటి రోజు నామినేషన్ల పర్వం..

**షాద్‌నగర్, నవంబరు 27, ప్రభాతవార్త :** మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు నగారా మ్రోగడంతో. గురువారం అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. మొదటి రోజే రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులను పోటీ కోసం 34 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా 19 మంది వార్డు సభ్యుల కోసం నామినేషన్లు ఇచ్చారనీ ఫరూక్ నగర్ మండల అభివృద్ధి అధికారి బన్సీలాల్ మీడియాకు తెలిపారు. మొత్తం మొదటి రోజు 34 మంది సర్పంచులకు 19 మంది వార్డు సభ్యుల పదవుల కోసం నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీవో బన్సీలాల్ స్పష్టం చేశారు.





స్వీకరిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు